618048601

# ప్రబోధ 10

చక్కెర కంటె తీపి, ఘృతసారము కంటె రుచ్యమౌను పెం
పెక్కిన తేనెకన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే యనిపించును, కాన నిత్యమున్
చక్కగ దాని మీరు మనసా స్మరింపుడు రామనామమున్

శబ్ద, స్పర్శ, రూప, రస గంధములు పంచభూతములు. ఇవి మానవ సుఖ దుఃఖములకు మూలకారణములు. వీటిని త్రికరణ శుద్ధిగా అనుభవించినప్పుడు అదిసుఖము.

మానవునకు దేహము, మాట, మనస్సు ప్రధానమైన ప్రాణములు అందులో దేహము అతిప్రధానమైనది. శరీరమాద్యం ఖలు ధర్మసాధనం. పెద్దలను గౌరవించవలెనన్నన్నా దేవతలను పూజించవలెనన్ననూ, తల్లితండ్రులను సేవించవలెనన్ననూ దేహమత్యవసరము. దేహమును ప్రసాదించినది పెద్దలను గౌరవించి, తల్లితండ్రులను సేవించి, దైవాన్ని ప్రేమించి, జీవితాన్ని సార్థకము చేసుకొనటానికే. తనను సంబంధించిన వేదశాస్త్రములను, ఇతిహాస పురాణములను, పెద్దల చరిత్రను చదివి వాటికి తగిన రీతిగా నడచుకొనటమే పవిత్రత. పరోపకారము చేసి సర్వుల మన్ననల నందుకోటమే కర్తవ్యము. సమాజమునందు సర్వుల మన్ననలనందుకోటమే శరీరమునకు ప్రధాన కర్తవ్యము. కనుక శరీరమనే కరణమును పరిశుద్ధము గావించుకొనవలెనన్న, పెద్దలసేవ, దైవప్రార్థన, తల్లితండ్రుల ఆజ్ఞ శిరసావహించటము అవసరం. ఈ సేవల ద్వారా తన కాయమును పరిశుద్ధము చేసుకొనవలెను. ఇది మొదటి కరణము. పరిశుద్ధతకు మార్గము.

రెండవది మాట. ఇతరులను నొప్పించకుండా సత్యయుతము, ప్రేమహితమైన వాక్కును పవిత్రము గావించుకోవాలి. ఉద్వేగము లేకుండా, పరులకు బాధ కలిగించే కఠిన వాక్కులు రాకుండా, ప్రియమైన వచనముల చేత, ఎదుటివారి హృదయమును రంజింపజేసే వాక్కులు మనసును మురిపింపజేసే వాక్కులు పలకాలి. అప్పుడే రెండవ కరణము పరిశుద్ధము కాగలదు.

మూడవది మనస్సు. మనస్సు నిరంతరము ఏదో చింతన చేస్తూనే వుంటుంది. 'మననాత్మకం మనః' 'సంకల్ప వికల్పాత్మకం మనః' అన్నారు. సంకల్ప వికల్పములనేవి మానవ సహజములు. మితిమీరిన వేగము చేతనే మానవుని మతిభ్రమి

స్తున్నది. కనుక దీనిని హితంలో పెట్టి, హితమును బోధించి పవిత్రం చెయ్యటానికి ప్రయత్నించాలి. ముఖ్యముగా మనసు ఇంద్రియ భోగములవైపు పరుగెత్తకుండా చూచుకోవాలి. ఇంద్రియముల పై ప్రసరించినప్పుడే మనస్సు దుఃఖముల పాలౌతుంది. మనసు యింద్రియముల పతి. ఒక భార్యతో జీవితము గడపటమే దుస్తరము. ముగ్గురు భార్యలున్న దశరథుని గతి ఏమైంది? కొడుకు ఎడబాటు, చివరకు రామచింతాగ్నితోనే జీవితమును కోల్పోవటము జరిగింది. ఉత్తానపాదునకు యిరువురు భార్యలుండటము చేతనే ధ్రువుని వంటి సుపుత్రుని కోల్పోయి అనేక దుఃఖములకు పాల్పడి, చివరకు తనప్రాణమును విడిచాడు. ఇద్దరు, ముగ్గురు సతులున్నవారికి యీగతి కల్గినప్పుడు, పదిమంది సతులు కల్గిన మనసు గతి యేరీతిగా వుంటుంది.

నోరు అడుగుతుంది పతిని 'పతీ! నాకు రుచికరమైన పదార్థములను తెచ్చిపెట్టు, లేకున్న నేను నీతో మాట్లాడను అంటుంది. శ్రవణేంద్రియం నాకు కావలసినవన్నింటిని వినిపించు లేకపోతే నీ ముఖమే చూడనంటుంది. ఇక నేత్రములు నన్ను ఏదైనా మంచి ఎగ్జిబిషన్ కు తీసుకొనిపో; చక్కని సినిమాలు, వీడియోలు, టెలివిజన్లు చూపించు చూపించకపోతే నేను యింటిలోనే వుండను' అని పోట్లాడుతుంది. ఈ విధంగా ఒక్కొక్క యింద్రియము ఒక్కొక్క ఆశను వెలిబుచ్చుతూ యీ మనసును అనేక విధములుగా హింసిస్తూ వుంటాయి. కనుకనే మనసు నిరంతరము విచారముతో కృంగి కృశించిపోతూ వుంటుంది. కారణము యింద్రియముల ప్రభావమే. ఈ యింద్రియముల వైపు మనసును మరలించకుండా వుండటానికి కృషి చెయ్యాలి. ఇంద్రియములను తమ అదుపులో వుంచుకోటానికి ప్రయత్నించాలి. అవి అడిగిన వాటినన్నింటినీ అందించకుండా జాగ్రత్తపడాలి. మనసు ఒక స్వతంత్రమైన స్థానాన్ని అందుకోవాలి. మనసు భర్త. ఇంద్రియములు భార్యలు. భర్త అనగా భరించేవాడు. భరింపబడేవి యింద్రియములు. ఈనాడు కలియుగ ప్రభావముచేత, ఇంద్రియములే భరించేవిగా మారిపోయి మనస్సేమో భరించబడేది అయింది. ఇంద్రియములకు వశమౌకావటం చేతనే మనస్సుకు యీగతి పట్టింది. చక్కగా విచారించి నిత్యానిత్య పరిశీలన చేసి, మనసు బుద్ధిని అనుసరించినప్పుడే యింద్రియములు అదుపులోవుంటాయి. ఈవిధముగా త్రికరణ శుద్ధిగావించుకున్న మూర్తి శ్రీరామచంద్రమూర్తి.

శ్రీరాముడు ఎవరు? శ్రీరామచంద్రుడు దశరథమహారాజు కుమారుడు మాత్రమేనని భావిస్తే, అతనిని స్మరించటము వలన, అతనిని భజించటము వలన, అతనిని ధ్యానించటము వలన మనకు వచ్చిన ప్రయోజనమేమిటి? దశరథుడు ఎవరు? దశరథుడు ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు వున్న దశేంద్రియముల రథమే దశరథుడు. ఈ దేహమనే దశరథుడు నిరంతరము సత్వగుణము

రజోగుణము,తమోగుణములతో కూడి వుంటాడు. ఆయన వరించిన సత్త్వ,రజో,తమో గుణములు ఎవరు? కౌసల్యా,సుమిత్ర,కైకేయి. ఈ మూడుగుణములను వరించిన దశరథుడే యీ దేహము. వారికి కల్గిన రామలక్ష్మణ భరత శతృఘ్నులే ధర్మార్థకామ మోక్షములనే చతుర్విధ పురుషార్థములు. సాక్షాత్ ధర్మస్వరూపుడైన రాముడు సాత్వికుడు. సత్త్వగుణము కల్గినవాడు కనుక యితడు ధర్మమూర్తి. అర్థకామ మోక్షములనే పురుషార్థములు ధర్మమును అనుసరించినప్పుడే అవి సార్థకము కాగలవు. కనుకనే లక్ష్మణ,భరత,శతృఘ్నులు రాముని అనుసరిస్తూ వచ్చారు. పుణ్యకార్యములు చేస్తూ సుగుణములను పోషించుకుంటూ వచ్చారు. మన చతుర్విధ పురుషార్థములందు పవిత్రమైన త్యాగమయమైన భావములు అభివృద్ధి పరచుకోవాలి. ఈవిధమైన సద్గుణములను పోషించుకొనటంచేతనే రాముడు శివధనుస్సును విరిచి వేయగలిగాడు. మనస్సును ఆవరించిన మోహమే యీ శివధనుస్సు. మోహమును అధిగమించినవాడు. జయించినవాడు. ఎవ్వరూ మిథిలాపుర రాజుకు కనబడలేదు. అతను వైదేహి వైదేహి అంటే ఎవరు? ఆత్మ స్వరూపుడు. వైదేహి అనగా దేహవాసనలు లేని గుణములను కలిగినవాడు. రాముడు మోహాన్ని సాధించటంచేతనే జ్ఞానమనే సీతను పొందగలిగాడు. బ్రహ్మజ్ఞానముతో కూడినది సీత. సీత ఎక్కడ చిక్కింది? భూమిలో చిక్కింది. కనుక బ్రహ్మజ్ఞానమును మనము ఎక్కడో వెతకటానికి ప్రయత్నించనవసరములేదు. ప్రకృతిలోనే పొందవచ్చు సీత భూజాత. భూమియందు వుద్భవించింది సీత. అనగా బ్రహ్మజ్ఞానము భూమియందే వుద్భవిస్తుంది. బ్రహ్మజ్ఞానము కలిగిన తరువాత రాముడు జీవితము అనే అరణ్యములో ప్రవేశించాడు. ఈ అరణ్యములో ప్రవేశించటానికి కారణమెవరు? రజోగుణాన్ని ఆవరించిన దశరథుడే దీనికి కారణము. ఈ దేహమును అనుసరించటం చేత జీవితమనే అరణ్యములోనికి ప్రవేశించారు. ఇక్కడ బ్రహ్మజ్ఞానారణ్యములో వాంఛలు అనే సంకల్పములు ప్రవేశించాయి. బ్రహ్మజ్ఞానము త్యాగముతో కూడినదేగాని రాగముతో కూడినది కాదు. బంగారు లేడిని చూచి రాగము కలగడం వల్లనే ధర్మముతో,సత్యముతో, అనగా రామునితో వియోగము కలిగింది. కనుక రాగము అనేది బ్రహ్మజ్ఞానమునకు పెద్దరోగము వంటిదని భావించాలి. ధర్మమూర్తి అయిన రాముడు కోల్పోయిన బ్రహ్మజ్ఞానమును సంపాదించుటకు అనేక సాధనలు చేశాడు. వెతుకుతూ వెతుకుతూ ఋష్యమూకమనే పర్వతమును చేరాడు. సర్వసంగ పరిత్యాగ స్థానమే ఋష్యమూకము. అక్కడ వివేకము అనే సుగ్రీవునితోనూ,ధైర్యము అనే హనుమంతునితోనూ స్నేహము చేశాడు. వారిరువురికి స్నేహము కుదిరిన తరువాత వీరి సమస్యలను పరిష్కరించటానికి ధర్మహృదయుడైన రాముడు ప్రయత్నించాడు. అదర్మమనే వాలిని,వివేకమనే సుగ్రీవునకు వైరము పెరిగింది. వాలి సుగ్రీవుని ధిక్కరించి,రాజ్యమును

అపహరించి అతనిని అరణ్యావాసమునకు పంపి అనేక విధముల బాధించి దుర్మార్గుడైన రావణునితో స్నేహము కల్పించుకొని, సోదరుని దూరము చేసుకున్నాడు. దుస్సంగము చేత దుఃఖము కలుగుతుందని నిరూపణ గావించాడు. ఎలాంటి స్నేహము చేస్తామో అలాంటి జీవితపు నడకలను మనము నడుస్తాము.

నీవు ఎలాంటి స్నేహితులతో కలసి జీవిస్తున్నావో చెప్పు. నీవు ఎలాంటి వాడివో చెప్పగలనని ఐన్‌స్టీన్ అన్నాడు. కనుక మంచి స్నేహాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. దుస్సంగాన్ని చేరటం చేతనే దుఃఖాన్ని అనుభవించవలసి వస్తుంది. దుర్గుణములు, దురాచారముల చేతను అతనికి యిటువంటి దుఃఖము కలిగింది. కనుక ధర్మహీనుడైన వాలిని సంహరించి వివేకవంతుడైన సుగ్రీవునికి రాముడు సహాయము చేశాడు. వీరి సహాయముతో సీతాన్వేషణ ప్రారంభించాడు. మధ్యలో మోహసాగరము అడ్డు తగిలింది. మోహమునకు అతీతమైన ధైర్యస్వరూపుడు హనుమంతుడు. అతనికి ఎట్టి మోహములు లేవు. రామనామము రామరూపమే అతనికి సర్వస్వము. రోమరోమము రామనామముతో నింపుకున్నవాడు హనుమంతుడు. కనుకనే మోహమనే సాగరాన్ని హనుమంతుడు అవలీలగా దాటగలిగాడు. మోహము లేకపోవటమే హనుమంతుని ధైర్యమునకు, సాహసమునకు కారణము. మోహసాగరమును దాటిన తరువాత ధర్మమనే రాముడు రజోగుణమైన రావణుని తమోగుణమనే కుంభకర్ణుని సంహరించి, సాత్వికమనే విభీషణునకు పట్టాభిషేకము చేసి అనుభవ జ్ఞానమైన సీతను తీసుకొని అయోధ్యకు వెళ్ళాడు. ఇది రామ పట్టాభిషేకము.

రామాయణమంతా మనలోనే వున్నది. మన నిత్య జీవితములో రామాయణమును సంపూర్తిగా దర్శించుకోవచ్చును. మన సుజ్ఞానమే సీత. మన దేహమే దశరథుడు. సత్వ, రజో, తమో గుణములే కౌసల్య, సుమిత్ర, కైకేయులు. చతుర్విధ పురుషార్థములే రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు. హృదయమే అయోధ్యానగరము. అట్టి హృదయమును సంపాదించుకొని, అలాంటి చతుర్విధ పురుషార్థములను సాధించి సరైన రీతిగా హృదయ సామ్రాజ్యాన్ని ఏలాలనుకుంటే అందుకు త్రికరణ శుద్ధి అవసరము.

కోతులలో కండా నీతి అధికముగా వుండేదని మన శాస్త్రిగారు చెప్పారు. ఆనాడు రామచంద్రుని సేవలో పాల్గొనటానికి అర్హమైనవి అవి. అయితే యీనాడు మానవులలో నీతి యేమాత్రము కనుపించటము లేదు. అందువలననే నీతిలేని జాతి కోతి కంటె హీనమన్నారు. రామాయణములో హనుమంతుని సంభాషణను చక్కగా వర్ణించాడు వాల్మీకి. భక్తుడు ఏవిధంగా వుండాలి? మంత్రి ఏవిధంగా వుండాలి. ప్రభువు నమ్మిన వ్యక్తి ఏవిధమైన ప్రవర్తనతో నడుచుకోవాలి? భక్తుని మాటలు ఎంత పవిత్రంగా వుండాలి? రాముడు

618048605

హనుమంతునితో సంభాషిస్తూ, హనుమంతుని నేత్రములను మాత్రమే చూస్తూ, ఆనందములో తన దుఃఖాన్ని మరచిపోయాడట. లక్ష్మణునితో రాముడు చెబుతాడు 'లక్ష్మణా విన్నావా హనుమంతుని వాక్యములు. అతని మాటలు ఋగ్వేదములోని వినయ విధేయతలను ప్రకటిస్తున్నాయి. యజుర్వేదములోని ధారణాశక్తిని ప్రస్తుతీకరిస్తున్నాయి. సామవేదములోని విజ్ఞతను ప్రదర్శిస్తున్నాయి. అతను సర్వశాస్త్రప్రవీణుడని అతని మాటలు వింటుంటే తెలుస్తుంది. చతుర్వేదములను సంపూర్తిగా గుర్తించినవాడు హనుమంతుడు. ఇటువంటివాడే నిజ భక్తుడు. ఇంతటి పవిత్రమైన నడత కలిగిన భక్తుడు సుగ్రీవుని మంత్రి కావటము అతని అదృష్టము. మానవునకు మనసు, మాట, క్రియ ఒక్కటి కావాలి.

మనసు మాట క్రియ మనిషికి ఒకటైన
సత్త్వవంతుడగును సరణి తోడ
సత్త్వవంతుడే దైవసాన్నిధ్యమందున
పొందుచుండు ప్రేమ నొందుచుండు.

అలాంటి అనుగ్రహము, అలాంటి ఆకర్షణ, అలాంటి దివ్యత్వమును గుర్తించగలగటంచేతనే హనుమంతుడు రామునకు సన్నిహితుడైన భక్తుడు కాగలిగాడు. వర్షాకాలము గడచిన తరువాత కూడా సుగ్రీవుడు సీతాన్వేషణకు సన్నాహాలు చేయకపోవటంతో లక్ష్మణుడు వెళ్ళి క్రోధంతో మాట్లాడి అతని మనస్సును నొప్పిస్తారు. సుగ్రీవా! నీవు ఉపకారమును మరచిన కృతఘ్నుడవు. ఇచ్చిన మాటను తప్పే మహా క్రూరుడవు. ఇలాంటి మూర్ఖులను ఇలాంటి కృతఘ్నులను ఏ మాత్రము క్షమించరాదు. బ్రహ్మహత్యా పాపమునకైననూ పరిహారమున్నది. మద్యపానము చేసిన వానికైననూ పరిహారమున్నది. చేసిన మేలును మరచిన క్రూరునను, మాట యిచ్చి తప్పిన మూర్ఖునను పరిహారమే లేదు. ఇట్టి వారిని ముక్కలు ముక్కలుగా కోసి పారవేసిన కాకులు, కుక్కలు కూడా అంటవు. సుగ్రీవా నీవు యీనాడు అనుభవిస్తున్న స్థానము ఎవరి వలన లభించింది? పూర్వము ఏస్థితిలో వుండేవాడవు? భోగభాగ్యములను పొందిన తక్షణమే మాట మరచిపోయినావు. ఇలాంటి మూర్ఖుడవు రాజ్యార్హుడవే కావు. లక్ష్మణుడు యీవిధముగా దూషిస్తుండగా రాజమాతయైన తార, హనుమంతుడు పరుగెత్తుకొని వచ్చి, రాముని చేతులను పట్టుకొని క్షమించుమని వేడుకొన్నారు. 'లక్ష్మణా! అజ్ఞానము చేత, మోహము చేత, విషయవాసనల చేత సుగ్రీవుడు జగత్తుకు బంధితుడౌతున్నాడు. సర్వసామాన్యముగా భోగములలో, సుఖములలో ఏవిధమైన సత్యమును ధర్మమును గుర్తించరు. కష్టకాలములోనే నీతి నిజాయితీలను, ధర్మమును గుర్తించి వర్తించటానికి ప్రయత్నిస్తారు. మానవత్వమంటే ఏమిటో గుర్తించని స్థితిలో వుంటారు.

రః అనగా అశాశ్వతము. నరః అనగా అశాశ్వతము కానిది. నరుడు శాశ్వతమైనవాడు. అశాశ్వతమైన దేహాన్ని శాశ్వతమైన దివ్యత్వము ధరిస్తున్నది. అట్టి శాశ్వతమైన దివ్యత్వాన్ని మనము మరచిపోతున్నాము. అశాశ్వతమైన దేహతత్వాన్ని మాత్రం ఆధారము చేసుకొని వుంటున్నాము. మద్యపానములో మునిగి, విషయలోలుడై తనను తాను మైమరచిన సుగ్రీవుడు రామాజ్ఞను ఏవిధముగా పాలించగలడు? అనగా దీని అంతరార్థమేమంటే జీవితం భోగభాగ్యముల నిమిత్తమై వాంఛల ఫలసిద్ధి గావించుకొనే నిమిత్తమై ఆరాటపడుతూ వుంటుంది. ఇవే మానవునికి మద్యపానములు. రాగద్వేషాదులలో మునిగే తత్వమే తన మందత్వానికి మూలకారణము. నిరంతరము ప్రాపంచిక సంబంధమైన విషయములకు మనస్సును అంకితముగావించటమే మందత్వానికి హేతువు. ధైర్యమనే హనుమంతుడు సుగ్రీవుని దగ్గరకు వెళ్లి చివాట్లు పెట్టి, తప్పిన మాటను దక్కించుకొనే నిమిత్తమై రాముని పాదమును పట్టుకొమ్మని కోరాడు. అధైర్యము వలన, బలహీనత వలన మానవుడు అనేక తప్పు మార్గములను అవలంబిస్తాడు. కాని అంతటితో మనము ధైర్యాన్ని కోల్పకూడదు. ధైర్యాన్ని తెచ్చుకొని చేసిన దోషములను మననము చేసుకొని దానికి తగిన పశ్చాత్తాపమును పొంది ప్రాయశ్చిత్తాన్ని చేసుకొన్న మానవుడు పవిత్రుడౌవుతాడు. హనుమంతుని ఆజ్ఞను శిరసావహించి, సుగ్రీవుడు రాముని దగ్గరకు వెళ్లి, తన దోషములను క్షమించమని ప్రార్థించి ఆక్షణమునుండి తన జీవితమును రామసేవకు అంకితము చేస్తానని వాగ్దానము చేశాడు.

రామచంద్రుడెక్కడున్నా ఏమి చెప్పినా, ఏమి చేసినా, ఏమి తలంచినా అంతా ధర్మమయమనే విషయాన్ని మనము విశ్వసించాలి. ప్రవహించే నది ఎక్కడవున్నా ఏకాలమందైనా, అది జలమేకాని మరొకటి కాదు. 'రామో విగ్రహవాన్ ధర్మః' రాముడు ధర్మమును అనుసరిస్తున్నాడు అని మనము అనకూడదు. రాముడు ధర్మమును ఆచరిస్తున్నాడు అని మనము అంతకంటె అనకూడదు. రాముడు ధర్మమును ఆచరించటము కాదు, రాముడు ఆచరించినదంతా ధర్మమే. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అని శృతి చెప్పింది. రామకథను వినటం, వినిపించటం యింతటితోనే మన కార్యము పూర్తయినదని భావించరాదు. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి అనగా బ్రహ్మమును గుర్తించినవాడు, బ్రహ్మను తెలుసుకున్నవాడు తానే బ్రహ్మ అవుతాడు. ధర్మమును బోధించినవాడు, ధర్మమును విన్నవాడు, వినిపించినవాడు ధర్మస్వరూపుడు కావాలి. మనము రామాయణమును వింటున్నాము. రామాయణమును వినిపిస్తున్నాము. కనుక మనము ధర్మస్వరూపులము కావాలి. అప్పుడే రామాయణమును వినిపించినందుకు, విన్నందుకు సార్థకత.

ముఖ్యముగా శ్రద్ధ అవసరము. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్'

శ్రద్ధలేకుండా చేసిన పూజలుకాని, భజనలుగాని, సాధనలుగాని, శ్రద్ధలేని ఏ పనైనాగాని నిరర్థకమై పోతుంది. నిస్సారమై పోతుంది. ప్రతివ్యక్తి తాను మానవునిగా బ్రతుకుతూ యితరులు కూడా మానవులుగా బ్రతికేటట్లు చూడాలి. తాను మంచిగా వుంటూ యితరులు కూడా మంచి చెయ్యటానికి పూనుకొనేటట్లు చేయాలి. ఇట్టి పవిత్రమైన భావములు త్రికరణశుద్ధితోనే ఏర్పడతాయి.

మొట్టమొదట మనము దేహాన్ని పరిశుద్ధము గావించుకోవాలి. అంటే సోపులతో, నీళ్లతో మరి యింక ఏదైనా పదార్థముతో పరిశుద్ధము గావించుకోటం కాదు. పవిత్రమైన కర్మలచేత దేహమును పరిశుద్ధము గావించుకోవాలి. మాటను సత్యముతోను, ప్రియముతోను, శాంతముతోనూ పరిశుద్ధము చేసుకోవాలి. మనసు యింద్రియములను కొంచెము దూరముగా వుంటూ సాధ్యమైనంతవరకు నిగ్రహించుకోటానికి ప్రయత్నం చేయాలి. నేటి ఆధునిక యుగములో యింద్రియ నిగ్రహమంటే ఏమిటో అర్థము కావటంలేదు. పశుపక్ష్యాదులైనా యింద్రియ నిగ్రహమునకు కృషి చేస్తున్నాయి గాని మానవుడు యేమాత్రము కూడా ప్రయత్నించటంలేదు. ఈనాడు ఆధునిక యుగమునందు విద్యలు అధికమయ్యే కొలది, వివేకము పెరిగే కొలది, తెలివితేటలు బలపడే కొలది, నైతిక గౌరవము దిగజారిపోతున్నది. మానవుడంటే యేమిటో గుర్తించుకోలేక పోతున్నారు. ఏమి చెప్పినా భయమే. ఎక్కడకు పోయినా భయమే. ఈ భయమెక్కడనుండి వస్తుంది? ఎక్కడ దోషముంటుందో అక్కడ భయము వుంటుంది. దోషము లేనివానికి భయమే వుండదు. ఈనాడు జీవితమంతా భయభ్రాంతులలో కూడివుంటున్నది. మితిమీరిపోతున్న వైజ్ఞానిక శాస్త్రంతో మానవుడు మానవత్వాన్ని భగ్నం చేస్తున్నాడు. కృత్రిమమైన జీవితాన్ని గడపటానికి పూనుకుంటున్నాడు. నిజంగా హృదయము కలిగిన మానవుడుగా జీవించటానికి పూనుకోటంలేదు. ఈ మనసు ఎక్కడనుండి వచ్చింది? అహంకారము నుండి వచ్చింది. అహంకారము ఎక్కడనుండి వచ్చింది. ఈ విధంగా మనము ఆధ్యాత్మిక తత్వాన్ని గుర్తించి నిజమానవులుగా జీవించటానికి ప్రయత్నించాలి. మానవుడు పుట్టినవెంటనే మొట్టమొదట గుర్తించేది అహం. నేను అనేదానినే మొట్టమొదట గుర్తిస్తాడు. ఆత్మపుత్రుడే అహం. ఈ అహం పుత్రుడే మనస్సు. మనసు ఆత్మకు మనుమడు. మనసునుండే వాక్కు పుడుతుంది. వాక్కు ఆత్మకు ముని మనుమడు. ఆత్మకు అహం పుత్రుడు. మనసు మనుమడు. వాక్కు ముని మనుమడు. కనుక వీరందరూ ఆత్మ కుటుంబానికి చెందినవారే నన్న సత్యాన్ని గుర్తించి వీటిని పెడమార్గంలో పెట్టటానికి పూనుకోరాదు.

యశోద తన ప్రక్కన పరున్న కృష్ణునికి రామకథ చెబుతున్నది. అనగా అనగా ఒక అయోధ్య వుండేది. ఆ అయోధ్యలో రాముడు వుండేవాడు.-- అని యీ కథనంతా

చెబుతూ కట్టకడపటికి లంకలో ప్రవేశించి రావణునితో యుద్ధమునకు పూనుకున్న ఘట్టము రాగానే 'లక్ష్మణా ఏది అంబు' అని అన్నాడుట కృష్ణుడు. ఆత్మ వాసన అనగా ఆత్మసంబంధము వుండటము వలననే గదా రామతత్వము కృష్ణతత్వం ఏకమైనవి. మనము వాక్కును వుపయోగపెట్టే సమయంలో కూడా ఆత్మను జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అహంకారమును ప్రవేశపెట్టినప్పుడు 'అయ్యో! నేను పుత్రుడను. నేనీవిధముగా ప్రవర్తించటం సరిగా వున్నదా అని జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అహం, వాక్కు. మనసులో ఆత్మను జ్ఞప్తికి తెచ్చుకున్నప్పుడు అవి పెడమార్గము పట్టుదానికి వీలుండదు.

రామతత్వమనేది మన హృదయ తత్వమే. రమయతీతి రామః. రమింపజేసేది రామతత్వము. రమింపజేసేది మన ఆత్మతత్వము. కాన భౌతికమైన లౌకికమైన చరిత్రను జ్ఞప్తియందుంచుకొని, అలౌకికమైన జగత్తునందు ప్రవేశించి, మనమే నిత్యసత్యధర్మ స్వరూపులమైన రాములము అన్న సత్యాన్ని ప్రకటించాలి.